26న మెగా జాబ్ మేళా

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి18: ఈనెల 26న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరుద్యోగ యువతకు పోలీసుల ఆధ్వర్యంలో వివిధ కంపెనీలకు సంబంధించి మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎస్పీ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఏదైనా డిగ్రీ, పీజీ పాసైన యువతీ యువకులు జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. దాదాపు 50 బహుళ జాతీయ కంపెనీలు జాబ్ మేళాలో ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు, కనీస వేతనం 18,000 నుంచి 75 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించి అభ్యర్థుల వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పురుగు మందు తాగి ఒకరి ఆత్మహత్య

కౌటాల, ఫిబ్రవరి 18: మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన సూరం విజయ్(24) శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మధుకర్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. విజయ్‌కి అదే గ్రామానికి చెందిన పల్లవి తో వివాహం అయ్యింది. విజయ్-పల్లవిల మధ్య ఈ నెల 14న గొడవ జరగడంతో పల్లవి వాళ్ల తల్లి గారి ఇంటికి వెళ్లింది. 17న విజయ్ తన భార్య అయిన పల్లవితో మాట్లాడేందుకు ప్రయత్నించిన ప్పటికీ ఆమె మాట్లాడక పోగా ఆమె బంధువులు విజయ్‌ను తిట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురై తన పంట చేనులో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మృతుని అన్న బానేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమ్మక్క-సారలమ్మ జాతరను విజయవంతం చేయాలి

తిర్యాణి,జనవరి 18 : మండలంలోని కన్నేపల్లి పంచాయితీ పరిధిలోని చిన్న అరటిపల్లి స్టేజీ వద్ద ఈనెల 21 నుంచి 24 తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరను విజయవంతం చేయాలని జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు వెడ్మ భగవంతరావు ఆదివారం తెలిపారు. జాతరలో దుకాణాల ఏర్పాటుకు 13న వేలం కూడా వేశామన్నారు. అలాగే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ జాతర నిర్వహణ వల్ల అడవులకు ఎలాం టి ముప్పు వాటిల్ల కుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు మార్నేని తిరుపతి, ప్రధాన కార్యదర్శి గుండం రారాజు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
వర్గీ: 91827 77671, 91827 77677

పది విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



పరీక్షను పర్యవేక్షిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్

పెంచికలపేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 18: పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయడమే తమ లక్ష్యమని అందుకే టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేశ్‌తో కలిసి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడంతో పాటు, పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు పరీక్ష ఉపయోగపడుతుందన్నారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 2,100 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. భవిష్యత్‌లో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడంతో పాటు అవసరం అనుకున్న విద్యార్థులకు ఆసరాగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మాలశ్రీ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, డీవైఎఫ్ఐ నాయకులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీశ్, నాయకులు పాల్గొన్నారు.

● **పెంచికల్‌పేట్‌లో..**

పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా, ఆశ్రమ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. విద్యార్థులోని ప్రతిభను వెలికి తీయుటకు ఈపరీక్ష నిర్వహిం చినట్లు తెలిపారు. టాలెంట్ టెస్ట్ విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో ఉపయోగపడనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ సభ్యులు కార్తీక్, నరసింహ, సాయి, వెంకటేశ్ పాల్గొన్నారు.

● **దహెగాంలో..**

దహెగాం,ఫిబ్రవరి18: టాలెంట్ టెస్టులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఎస్ఐ సనత్‌కుమార్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో మండలంలోని వివిధ పాఠశాలకు చెందని 103 మంది 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్టు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నవీన్, మండల నాయకులు రిషి, గణేశ్, పున్నం, సందీప్ పాల్గొన్నారు.

దహెగాం: టాలెంట్ టెస్టు ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఐ సనత్‌కుమార్

వనదేవతల జాతరకు సర్వం సిద్ధం

రెబ్బెన: జాతరకు ముస్తాబైన సమ్మక్క, సారలమ్మ గద్దెలు

పెద్దవాగు సమీపంలో గద్దెల వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

రెబ్బెన, ఫిబ్రవరి 18: మండలంలోని గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం పక్కన, లక్ష్మీపూర్ గ్రామశివారులోని కంకవనం చెట్ల కింద రాళ్లలో వెలసిన సమ్మక్క-సారలమ్మ జాతర 21 నుండి 24వ తేదీ వరకు కొనసాగుతుందని పూజారులు గొల్లపెల్లి సత్తమ్మ, దేవర వినోద్‌స్వామిలు తెలిపారు. ఈ నెల 21న బుధవారం సారలమ్మ గద్దెపైకి వస్తుందని, 22 న గురువారం సమ్మక్కగద్దె పైకి వస్తుందని, 23న శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించుకోవడం, 24న శనివారం వన దేవతలు వన ప్రవేశంతో జాతర ముగుస్తుందని పూజారులు తెలిపారు. జాతర కోసం గద్దెలు ముస్తాబు చేయడంతో పాటు భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.

● **కాగజ్‌నగర్‌లో..**

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, ఫిబ్రవరి 18 కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగు సమీపంలో కొలువైన సమ్మక్క సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయని కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ తెలిపారు. ఆదివారం నుంచి మొదలైన జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యలు ఏర్పాటు చేశామని, నీటి సదుపాయం, అమ్మవార్ల గద్దెలకు రంగులు అద్దడం, జాతరకు వచ్చే భక్తులకు షెడ్డు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం జాతర ప్రారంభోత్సవాన్ని జరుపుకుంటూ కమిటీ సభ్యులు పోచమ్మ మైసమ్మ ఆలయాల్లో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి పోలోజు శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు సీ.పీ.రాజ్‌కుమార్, మంద రాజయ్య, సభ్యులు ఆవదూత శ్రీనివాస్, పిరిసింగుల శ్రీనివాస్, బోమెల వెంకటేశ్, వెంకటేశ్, పిరిసింగుల తిరుపతి, కోట శంకర్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయండి

రెబ్బెన, ఫిబ్రవరి 18 : జిల్లాలో ఈ నెల 22,23 తేదీల్లో జరిగే బీజేపీ విజయ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం విజయ సంకల్ప్ యాత్ర వాల్ రైటింగ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాసరలో 20న ప్రారంభమయ్యే యాత్ర 22న జిల్లాలో ప్రవేశిస్తుందని 22,23 తేదీల్లో యాత్ర జిల్లాలో కొనసాగుతుందని బీజేపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ ప్రభారీ రావుల రాజేందర్, ఆదిలాబాద్ పార్లమెంట్ కో కన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు క్రిష్ణకుమారి, అసెంబ్లీ కన్వీనర్ సోల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి కుందారపు బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్‌తోపాటు పలువురు ఉన్నారు.

పాడిరైతుకు చెక్కు అందజేత



గంగాపూర్‌లో చెక్కు అందజేస్తున్న విజయ డెయిరీ సభ్యులు

రెబ్బెన, ఫిబ్రవరి 18: విజయ డెయిరీలో నిత్యం పాలు పోసే పాడి రైతుకు విజయ డెయిరీ వారు 'విజయ పెళ్లి కానుక' పేరుతో 5 వేల రూపాయలు అందిస్తున్నదని జిల్లా బీఎంసీయూ ఇన్‌చార్జి వెంకటేశ్ పేర్కొన్నారు. గంగాపూర్ గ్రామానికి చెందిన పాడిరైతు జాగరి బాపురావు కూతురు వివాహం ఆదివారం గంగాపూర్‌లో జరగగా వారి ఇంటికి వెళ్లి రూ. 5వేల చెక్కు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలమిత్ర మన్యం సత్యనారాయణ, మన్యం పద్మతోపాటు పలువురు ఉన్నారు.

ఓవర్‌లోడ్ లారీలతో ఇబ్బందులు

ముత్తంపేట క్రషర్ నుంచి కంకర లోడ్‌తో మహారాష్ట్రకు వెళ్తున్న లారీలు

కౌటాల, ఫిబ్రవరి 18: మండలంలోని ముత్తంపేట స్టోన్ క్రషర్‌ల నుంచి నిత్యం పదుల సంఖ్యలో లారీలు కంకర అధిక లోడ్‌తో మండల కేంద్రం మీదుగా మహారాష్ట్రకు తరలుతున్నాయి. లారీలల్లో పరిమితికి మించి అధికలోడ్‌తో లారీ బాడీ పైవరకు కంకర నింపి వెళ్లడంతో ప్రధాన రోడ్డుపై కంకర గల బ్రేకర్‌ల వద్ద, గుంతల వద్ద కంకర రాళ్లు పడుతున్నాయి. దీంతో మండల కేంద్రంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై పడిన కంకర రాళ్ల వల్ల మోటర్ సైకిల్‌పై వెళ్లే వాహనదారులు పలువురు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. ఓవర్ లోడ్‌తో వెళ్లడంతో మండల కేంద్రంలోని రామాలయం వద్ద రోడ్డు కుంగిపోయి పెద్దగుంత ఏర్పడింది. ఒక్కో లారీలో దాని కెపాసిటికి మించి 10 నుంచి 14 టన్నుల వరకు అధికలోడ్‌తో వెళ్తున్నాయి. పెద్దఎత్తున లారీలు తిరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ ఇటు వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది

జొన్న వంటకాలతో పోషకాలు మెండు

కెరమెరి : చేనులో సాగు చేస్తున్న జొన్నపంట

పెనంపై రొట్టె కాల్చుతున్న మహిళ

తయారైన జొన్నరొట్టె

కెరమెరి, ఫిబ్రవరి 18 : ఒకప్పుడు జొన్న వంటకాలంటే అదోరకంగా చూసేవారు. కానీ నేడు మారిన జీవనశైలితో ఆరోగ్యపరంగా అవే స్పెషల్ వంటకాలుగా మారాయి. గ్రామీణ ప్రాంతాలల్లోనే కాకుండా పెద్దపెద్ద హోటళ్లలోనూ నేటి స్పెషల్ జొన్న రొట్టె అని బోర్డులు పెట్టి మరీ అమ్ముతున్నారు. ఏవయస్సు వారైన, ఏ రోగినైన పత్యం లేకుండా భుజించే ఆహారం జొన్నరొట్టె, గటక. ఏ కూరలైన, పెరుగయినా గటకతో భలే రుచిగా ఉంటుంది. పల్లెలో ప్రతిరోజు చేసే సాధారణ వంటకమైన, పట్టణ ప్రాంతాల్లో నివాసించే వారికి మాత్రం జొన్నరొట్టంటే అదో పసందైన వంటకం. షుగర్‌తో బాధపడుతున్న వారికి ఇదే ముఖ్యమైన మెనూగా మారింది. మరి ఈ వంటకాలు ఎలా తయారు చేస్తారో తెలుసుకుందాం..

● **జొన్న రొట్టె తయారీ..**

ఏ మాత్రం నూనె అవసరం లేకుండా జొన్న రొట్టెను తయారు చేస్తారు. ముందుగా నీళ్లను ఓ పాత్రలో వేడి చేస్తారు. మరిగిన నీళ్లలో జొన్నపిండి వేసి కలుపుతారు. పిండిని ముద్దగా చేసిన అనంతరం పీటపై ఉంచి మెల్లమెల్లగా వొత్తుతూ పలుచగా గుండ్రని ఆకారంలో చేస్తారు. తర్వాత వేడి అయిన పెనంపై వేసి కొద్దిసేపు రెండు వైపుల తిప్పుతూ ఉడికిస్తారు. అంతే కొద్ది నిమిషాల్లో పసందైన జొన్న రొట్టె సిద్ధం.

● **జొన్న గటక తయారీ..**

ఓ పాత్రలో నీళ్లు వేడిచేసి అవి బాగా మరిగిన తర్వాత గటక పిండిని నీళ్లలో పోస్తూ గరిటెతో కలుపుతారు. నీళ్లకు సరిపడే విధంగా జొన్న పిండిని పోసి బాగా కలిపి పాత్రపై మూతవేసి కొద్దిసేపు సన్నని మంటపై ఉంచుతారు. ఇలా అరగంట ఉంచిన తర్వాత పోషకాలతో కూడిన వేడివేడి గటక రెడీ. దీన్ని పెరుగు పోసుకుని తింటే చాలా రుచిగా ఉంటుంది.

బాల్య వివాహం అడ్డగింత

హేటిగూడలో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సఖీ సెంటర్ అధికారులు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 18 : మండలంలోని హేటిగూడలో మైనర్ బాలికకు సోమవారం వివాహం చేస్తున్నారనే ముందస్తు సమాచారంతో ఆదివారం ఎం. శ్రీనివాస్ లీగల్ ప్రొబేషనరీ అధికారి, ప్రవీణ్ చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్, రవళి చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ జిల్లా అధికారులు అక్క డికి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలిపివేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ లీగల్ ప్రొబేషనరి అధికారి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జరిగే అనార్థాలపై, చట్టాలపై, అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరపకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం బాలికను సఖీ కేంద్రానికి తర లించారు. వారి వెంట మహిళా కానిస్టేబుల్ కాంత, పంచాయతీ కార్యదర్శి విఘ్నేశ్, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ఎంపీపీ అవిశ్వాసంపై హైకోర్టు స్టే

ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ చునార్కర్ సువర్ణ

సిర్పూర్(టీ), ఫిబ్రవరి 18 : సిర్పూర్(టీ) ఎంపీపీ చునార్కర్ సువర్ణపై ఆరుగురు ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస నోటీసుపై శనివారం హైకోర్టు స్టే విధించినట్లు ఆదివారం ఎంపీపీ చునార్కర్ సువర్ణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆదివారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ నెల 5న తన ఎంపీపీ పదవీపై కొందరు ఎంపీటీసీ సభ్యులు కాగజ్‌నగర్ ఆర్డీవో కు అవిశ్వాసంపై నోటీసులు అందజేశారన్నారు. దీనిపై ఈనెల 27న విశ్వాస పరీక్షకు ఆర్డీవో తేదీని ఖరారు చేసి, తమకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. అవిశ్వాసంపై తాను హైకోర్టును ఆశ్రయించగా, అవిశ్వాసంపై పలు అంశాలను పరిగణనలోకి తీసుకోని 27న నిర్వహించాల్సిన విశ్వాస పరీక్ష నిర్వహించకుండా హైకోర్టు స్టే విధించినట్లు పేర్కొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో పూజలు

కనుకదుర్గాదేవి ఆలయంలో పుట్టు వెంట్రుకలు తీస్తున్న దేవర వినోద్

రెబ్బెన, ఫిబ్రవరి 18 : మండలంలోని ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం, నైవేద్యాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలయ ప్రధాన అర్చకుడు దేవర వినోద్‌స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం ఏర్పాటు చేశారు.

అక్రమంగా నివాసం ఉంటున్న వారు ఖాళీ చేయాలి

రెబ్బెన, ఫిబ్రవరి 18: బెల్లంపల్లి ఏరియా గోలేటిటౌన్‌షిప్ కార్మిక కాలనీలలో ఎస్‌డి టైప్ క్వార్టర్స్ లో అక్రమంగా నివాసం ఉంటున్న వారు ఖాళీ చేయాలని బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాకు 150 మంది వరకు కొత్తగా ఉద్యోగులు వచ్చారని వారికి క్వార్టర్లు అవసరం ఉన్నందునా అక్రమంగా ఉన్న వారు ఖాళీ చేయాలని, ఇప్పటికే అలా ఉంటున్న వారికి నోటీసులు అందించామన్నారు. శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్ కు మరమ్మతులు కూడా చేస్తామని, అలా ఉన్న వాళ్లు కూడా ఖాళీ చేయాలని వారు సూచించారు.

వధూవరులను ఆశీర్వదించిన జడ్పీ చైర్మన్

కొండపల్లిలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే సక్కు

పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 18 : మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుధాకర్ అనసూర్య దంపతుల రెండో కుమార్తె వివాహానికి జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి మాజీ సర్పంచ్‌లు సంజీవ్, చంద్రమౌళి, శ్రీనివాస్ నాయకులు సముద్రాల రాజన్న, బండు,ఎస్.కె బాబు పాల్గొన్నారు.

జిల్లా ఆదివాసీ సంక్షేమ పరిషత్ కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 18: కుమ్రం భీంజిల్లా ఆదివాసీ సంక్షేమ పరిషత్ కొత్త కమిటీని జిల్లా కేంద్రంలోని ఆశ్రమ బాలుర పాఠశాలలో ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా నరేశ్, ప్రధాన కార్యదర్శిగా మడావి మాన్కు, గౌరవ అధ్యక్షుడిగా ఆడ భీర్షవ్, ఉప అధ్యక్షుడిగా గెడెం జుగాదిరావ్‌లు ఎన్నికయ్యారు. అనంతరం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎయూఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి నీలకంఠ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కోర్వేత రవీందర్, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి కే. ఫకృదాష్, పంచాయత్‌రాజ్ శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి

తిర్యాణి, ఫిబ్రవరి 18 : మండలంలోని కూలీలకు ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు పెందోర్ ధర్ము కోరారు. ప్రతీ ఏడాది కూలీలకు మార్చి నుంచి పనులు కల్పించాల్సి ఉండగా ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కూలీలు పనుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయని ఆరోపించారు. అక్కడక్కడ అడపాదడపా పనులు కల్పిస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో అన్ని గ్రూపుల వారికి పనులు దొరకకపోవడంతో ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ప్రతీ సంవత్సరం ఆలస్యంగా పనులు కల్పించడం, వ్యవసాయ పనుల పేరిట ఉపాధి పనులు బంద్ చేయించడంతో కూలీలకు వందరోజుల పనులు దొరకడం లేదన్నారు.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నిర్ణీత సమయంలో అర్హులైన కూలీలందరికీ వంద రోజుల పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సిర్పూర్(టీ), ఫిబ్రవరి 18 : రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో ధూప దీప నైవేద్యం పథకం కింద అర్చకులుగా పనిచేస్తున్న వారందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తూ, ఖాళీగా ఉన్న ఆలయాల్లో నియామకాలు చేపట్టాలని డీడీఎన్ రాష్ట్ర సంఘం ప్రతినిధి గంగు సత్యనారాయణ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 20న తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమంలో అర్చకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు సూచించారు.